క్లుప్తంగా

మంత్రిని కలసిన సమన్వయకర్త



రాప్తాడులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వీరాంజనేయులు, ప్రమీల

శింగనమల: రాప్తాడులో ఈ నెల 18న నిర్వహించే సిద్ధం సభను పరిశీలించడానికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శింగనమల వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల పుష్పగుచ్ఛం అందించారు. సభ విజయవంతంపై మంత్రితో వారు చర్చించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



కొలాపురమ్మ గుడి అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న సీడీపీఓ ఢిల్లీశ్వరి

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని కొల్లాపురమ్మ గుడి, చెంబుల బావి వీధి, జెండా వీధి, సీపీ బంగ్లా అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సీడీపీఓ ఢిల్లీశ్వరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని రికార్డులు, స్టాక్ పరిశీలించారు. సమయపాలన పాటించాలని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్ నాగేశ్వరి పాల్గొన్నారు.

15న ఊటకల్లులో ఉరుసు

గుత్తి రూరల్: మండలంలోని ఊటకల్లు గ్రామంలో ఈ నెల 15 నుంచి 17 వరకూ మూడు రోజుల పాటు హజరత్ మౌలాలి స్వామి ఉరుసు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 15న గంధం, 16న ఉరుసు, 17న జియారత్‌తో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. 16వ తేదీ అన్నదానం, రాత్రి చెక్క భజన పోటీలుంటాయన్నారు. భక్తులు ఉరుసును విజయవంతం చేయాలని దర్గా కమిటీ సభ్యులు కోరారు.

కాశినాయన విగ్రహం ఊరేగింపు



విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని గార్లదిన్నెలో మంగళవారం కాశిరెడ్డి నాయన విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. బుధవారం ఉదయం అశ్వర్థనారాయణ స్వామి క్షేత్ర సమీపంలోని పెన్నానది ఒడ్డున నూతనంగా నిర్మించిన ఆలయంలో స్వామి ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నారు. ప్రతిష్ఠ అనంతరం కాశినాయన ఆశ్రమంలో అన్నదానం నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డులో చెరువు కట్ట వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. విడపనకల్లు గ్రామానికి చెందిన రామాంజి గుత్తికి పని మీద బైక్‌లో వచ్చాడు. తిరిగి వెళ్తున్న సమయంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రామాంజి గాయపడ్డాడు. స్థానికులు గమనించి అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వైద్య రంగానికి సీఎం అధిక ప్రాధాన్యత



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

గుత్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జంగాల కాలనీలో ఆయూష్ ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం కాలనీవాసులతో సమావేశం నిర్వహించారు. జగన్ సీఎం అయ్యాక 17 మెడికల్ కాలేజీలు నిర్మించారన్నారు. అనేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మించారన్నారు. వైఎస్సార్ ఆరోగ్య బీమా రాష్ట్రంలో 95 శాతం మందికి వర్తింపజేశారన్నారు. నాడు–నేడు పథకం కింద ఆసుపత్రులను అభివృద్ధి చేసి అన్ని సదుపాయాలు కల్పించారన్నారు. వైఎస్ జగన్‌ను మరోసారి సీఎం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అశ్వ సురేష్, అశ్వ చిన్న మారెన్న, పుల్లయ్య, రాము, రంగస్వామి, చిన్న లాలు, ఈభూతి సురేష్, కుల్లాయప్ప, యడవలి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆసరాతో మహిళలకు భరోసా





డ్వాక్రా మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యేలు వై వెంకటరామిరెడ్డి, శంకర్‌నారాయణ, హాజరైన డ్వాక్రా మహిళలు

- జగనన్నను మళ్లీ గెలిపించి మహిళా శక్తిని చాటండి
- ఆల్ ఫ్రీ బాబును నమ్మి మోసపోవద్దు
- గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: అక్కచెల్లెమ్మల ఆర్థికస్వావలంబన, సాధికారతే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు మహిళల జీవితాల్లో వెలుగులు నింపాయని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మార్కెట్ రోడ్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే వైవీఆర్, పెనుగొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ చేతుల మీదుగా నాలుగో విడత ఆసరా కింద పట్టణంలోని 1,335 పొదుపు సంఘాలకు విడుదలైన రూ.9.37 కోట్ల మెగా చెక్కును అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగసభను ఉద్దేశించి ఎమ్మెల్యే వైవీఆర్ మాట్లాడారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశాడన్నారు. బాబు హయాంలో డ్వాక్రా సంఘాలన్నీ అప్పుల ఊబిలో కూరుకుపోయాయన్నారు. కానీ ప్రజాప్రస్థానం పాదయాత్రలో భాగంగా జగనన్న ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ ఆసరా ద్వారా డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణాలన్నీ మాఫీ చేశారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల్ని మోసం చేయడానికి పగటివేషగాళ్లు మీ ఇళ్ల వద్దకు వస్తున్నారని, వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. జనసేన అధినేత పవన్ సినిమాలకు తప్ప ప్రజాసేవ చేయడానికి పనికిరాడన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మైమూన్, కమిషనర్ వెంకటరమణయ్య, మాజీ చైర్మన్ రామలింగప్ప, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, సీఎంఎం భవాని, సీఓలు, ఆర్‌పీలు, భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు

రుణమాఫీ పేరుతో డ్వాక్రా మహిళలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబని మాజీ మంత్రి శంకర్‌నారాయణ విమర్శించారు. 2014లో 25 వేల కోట్ల డ్వాక్రా రుణాల్ని మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు ఐదేళ్ల కాలంలో కేవలం రూ.7 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారన్నారు. పావలా వడ్డీ, సున్నా వడ్డీ పథకాలకు సున్నా చుట్టాడని ధ్వజమెత్తారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోను పార్టీ వెబ్‌సైట్‌లో నుంచి తీసివేయించిన చంద్రబాబు, లోకేష్‌కు జగనన్నను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. ఎన్నికల వేళ చంద్రబాబు, పవన్ కూటమిని జాకీలు పెట్టి లేపడానికి ప్రయత్నిస్తున్న పచ్చమీడియా కథనాలను చూసి మోసపోవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలకు పుట్టగతుల్లేకుండా చేయాలని ఆయన కోరారు.

ఆసరాతో ఆర్థికాభివృద్ధి సాధించాం



ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ మా సంఘానికి 2019 కంటే ముందు ఉన్న రుణం రూ.6.84 లక్షల డబ్బును వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మా ఖాతాల్లోకి జమ చేశారు. జగనన్న చేసిన ఈ ఆర్థికసాయం ద్వారా సంఘంలోని సభ్యులు చిరువ్యాపారాలు చేసుకుంటూ ఆర్థిక ప్రగతి సాధించాం. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలుస్తాం.

– ఎం.ఆసియాబేగం, శ్రీలత స్వశక్తి సంఘం

సంక్షేమ పథకాలతో వెలుగు



డ్వాక్రా అక్కచెల్లెమ్మలను తోబుట్టువులుగా భావించిన జగనన్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పొదుపు సంఘాల ప్రగతికి పాటుపడ్డారు. మా పొదుపు సంఘానికి ఎన్నికల కంటే ముందు రూ.4.22 లక్షలు రుణముండేది. వైఎస్సార్ ఆసరా పథకం కింద రుణమాఫీ అయింది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– సత్యరాణి, శ్రీ మంజునాథ స్వశక్తి సంఘం

గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యం



యాడికిలో నంబర్–3 గ్రామ సచివాలయ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. యాడికి మండలం కమలపాడులో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ను రూ.77.16లక్షలతో, యాడికి మండల కేంద్రంలో నంబర్–2, నంబర్–3 గ్రామ సచివాలయాలు, మార్కెట్‌లో ఆర్బీకేను రూ.98.94లక్షలతో నిర్మించిన నూతన భవనాలను మంగళవారం ఉదయం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ సేవల కోసం గ్రామీణులు సుదూరంగా ఉన్న మండల కేంద్రాలకు వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లేవారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలువైన తర్వాత సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను సీఎం వైఎస్ జగన్ చేరువ చేశారన్నారు. ఆర్‌బీకేల ద్వారా విత్తనాలతో పాటు అవసరమైన ఎరువులనూ అత్యంత పారదర్శకంగా అందజేస్తున్నామన్నారు. పంట నష్టాలకు సంబంధించి ఆయా సీజన్‌లోనే పరిహారం అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఊరూరా వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసి గ్రామాల్లోనే వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దనే వైద్య సేవలు అందుతున్నాయన్నారు. చంద్రబాబు పాలన మొత్తం స్కామ్‌లతోనే కొనసాగిందన్నారు. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీడీఓ సావిత్రి, ఈఓ ఎర్రిసామి, మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీలు వెంకటనాయుడు, అవుకు నాగరాజు, రామ్మోహన్, వార్డు సభ్యులు తిరుపతి, రామచంద్ర, సచివాలయాల మండల కన్వీనర్ శివప్రసాద్, కాంట్రాక్టర్ పులిశేఖర్‌రెడ్డి, పీఆర్ ఏఈ ఆదినారాయణరెడ్డి, నాయకులు మారుతి, బీసీ మల్లికార్జున, రామకృష్ణ, జయుడు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

యల్లనూరు: మండలంలోని బొప్పేపల్లిలో చేపట్టిన ఉపాధి పనులను మంగళవారం తాడిపత్రి క్లస్టర్ ఏపీడీ వెంకటరత్నం పరిశీలించారు. కూలీల హాజరు, రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట ఉపాధి సిబ్బంది ఉన్నారు.

క్రీడల్లో సత్తాచాటిన పీడీ



జాతీయ స్థాయిలో సిల్వర్ మోడల్ దక్కించకున్న రమేష్‌బాబు

గుంతకల్లు: పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముంటున్న ఫీజికల్ డైరెక్టర్ ఎస్.రమేష్‌బాబు 5వ నేషనల్ మాస్టర్స్ చాంపియన్ షిప్ పోటీల్లో సత్తా చాటారు. మండలంలోని వైటీచెరువులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పీడీగా పనిచేస్తున్న ఆయన గత జనవరి నెల 6,7వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో గోల్డ్ సాధించాడు. దీంతో ఆయన్ను నేషనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 8 నుంచి 11 వరకూ హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన చాంపియన్‌షిప్ పోటీల్లో తిరిగి షాట్‌పుట్, డిస్కస్ త్రోలో సిల్వర్ మోడల్ సాధించాడు. దీంతో ఇంటర్నేషనల్ పోటీలకు ఎంపికయ్యే అవకాశం ఉందని సంతోషం వ్యక్తం చేశారు. రమేష్‌బాబును సహచరులు, మిత్రులు అభినందించి ఇంటర్నేషనల్‌లో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

ముతవల్లిగా బాధ్యతలు అప్పగించండి



మాట్లాడుతున్న ముతవల్లి వహిద్‌జుమ

గుంతకల్లు: మస్తానయ్య దర్గాలో ముతవల్లిగా బాధ్యతలు అప్పగించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఎం.వహిద్‌జుమ ఆరోపించారు. మంగళవారం మస్తానయ్యదర్గా సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని పాతగుంతకల్లులోని మస్తానయ్య దర్గాకు సంబంధించిన ఆదాయంలో అవకతవకపై 2017లో అప్పటి పీఠాధిపతిని బాధ్యతల నుంచి తొలగించారు. అనంతరం దర్గా బాధ్యతలు పూర్తిగా వక్ఫ్‌బోర్డులో చేతిలోకి వెళ్లి ఇన్‌స్పెక్టర్‌ను నియమించారు. ఈ విషయమై పీఠాధిపతి అప్పట్లో కోర్టును ఆశ్రయించగా వ్యతిరేకంగా తీర్పు వచ్చిందన్నారు. 2021 డిసెంబర్ 6న తనను (వహిద్‌జుమ) ముతవల్లిగా ఎంపిక చేశారు. అయితే దీన్ని సవాళ్లు చేస్తూ పీఠాధిపతి కోర్టుకు వెళ్లగా నాకు అనుకూలంగా 2022 స్టే వచ్చింది. అప్పటి నుంచి తనకు ముతవల్లిగా బాధ్యతలు అప్పగించుకుండా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దర్గా పనులను తొలగించిన పీఠాధిపతులతోనే చేయించుకోవడం ఎంతవరకూ సమజసం అని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు స్పందించి తనకు ముతవల్లి బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు.

సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి



ఫ్యాను గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న యువ నాయకుడు సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్ పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన 18వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సీఎం జగనన్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టి ఇంటి ముంగిటకే పథకాలు అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల చిన్న నాగిరెడ్డి, నాయకుడు నాగిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణపై అవగాహన



కుష్టువాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణ కమ్యూనిటీ ఆసుపత్రిలో మంగళవారం కుష్టువ్యాధి నివారణపై వ్యాధిగ్రస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కుష్టువ్యాధి గుత్తి డివిజనల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. కుష్టువ్యాధి గురించి భయపడాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వం ఈ వ్యాధి పట్ల ప్రజలకు ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ఏటా గాంధీ వర్ధంతి జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకూ స్పర్శ కార్యక్రమం చేపడుతోందన్నారు. అందులో భాగంగానే ముగింపుగా పామిడిలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కుష్టువ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపరాదన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న మందుల వినియోగం వల్ల ఈ వ్యాధి ఏడాదిలోపు నయమవుతుందన్నారు. కార్యక్రమంలో అడిషినల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనుపమ జోయల్, వైద్యాధికారి ఎల్లప్ప, సిబ్బంది, రోగులు తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’ పేదలకు వరం



పుట్లూరు మండలం అరకటివేములలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీవాణి



బుక్కరాయసముద్రంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పుట్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని మండల వైద్యాధికారి శ్రీవాణి అన్నారు. మంగళవారం మండలంలోని సూరేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సచివాలయంలో సర్పంచ్ పార్వతి అధ్యక్షతన ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 507 మంది పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు వినోద్ తెహరున్నీసా, స్వాతి లక్ష్మి, ఈఓఆర్డీ దామోదరమ్మ, పంచాయతీ సెక్రటరీ సాదిక్ వలి, పీహెచ్‌ఎన్ చెన్నమ్మ, సూపర్ వైజర్ ఈశ్వరమ్మ, సీహెచ్‌ఓ మోహన్ రావు, కుమార్, మోహన్‌బాబు పాల్గొన్నారు.



గార్లదిన్నె మండలం మర్తాడులో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని మర్తాడు–1 గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా 442 మంది వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు గౌతమి, దిలీప్, స్పెషల్ డాక్టర్లు సాయి హరికృష్ణ, మోహిత, సీహెచ్‌ఓ లోక్ నాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అక్షరాభ్యాసం

పామిడి: పట్టణంలోని సరస్వతీ ఉన్నత విద్యామందిరంలో బుధవారం అక్షరభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం మయూరి మంగళవారం తెలిపారు. విద్యాదీవెనలు ఇచ్చే సరస్వతీ మాత జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. బాసర నుంచి తెప్పించిన సరస్వతీ మాత తిలకం దిద్ది వేదపండితుల ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అనంతరం పండితులచే చిన్నారులకు అక్షరభ్యాసం ఉంటుందన్నారు. అవకాశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న బొంబాయి రమేష్‌నాయుడు

యాడికి : నాయీ బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు అన్నారు. నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.10 లక్షల ఎంపీ నిధులు మంజూరయ్యాయి. మంగళవారం మండల కేంద్రంలోని గుత్తి రహదారిలో వెంకటేశ్వర డిగ్రీ కళాశాల సమీపంలో ఆ సంఘానికి చెందిన స్థలంలో మండలంలోని నాయి బ్రాహ్మణులు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం మండల కన్వీనర్ చేత భూమి పూజను చేయించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు రామేశుడు, తూట్రాళ్లపల్లె సర్పంచు సంజీవరాయుడు, రంగయ్య, రామకృష్ణ, శ్రీనివాసులు, సుబ్బు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు

బుక్కరాయసముద్రం: మండలంలోని చెన్నంపల్లి రోడ్డు సమీపంలో రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. చెన్నంపల్లి క్రాస్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలేరో వాహనంలో తరలిస్తున్న 18 క్వింటాళ్ల రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.79,200 ఉంటుందన్నారు. డ్రైవర్, వాహన యజమానిని అదుపులోకి తీసుకుని బీకేఎస్ పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఏఈఈ రాజశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్య అభ్యసించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

పెద్దవడుగూరు: ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, క్రమశిక్షణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్‌కు ఆర్థికసాయం

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని నాయీ బ్రాహ్మణ కాలనీలో నివాసముంటున్న వలంటీర్ రామాంజనేయులు నెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో మంచాన పడ్డాడు. విషయం తెలుసుకున్న ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథనాథ రెడ్డి మంగళవారం రామాంజి సోదరుడు గోపీని తాడిపత్రిలోని తన స్వగృహానికి పిలిపించి చికిత్స కోసం రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు.

పంచాయతీ అభ్యున్నతికి పాటుపడండి

పామిడి: బకాయి ఉన్న ఇంటి పన్నులను సత్వరం చెల్లించి పంచాయతీ అభ్యున్నతికి పాటుపడాలని ఈఓ పి.చంద్రశేఖర్ మంగళవారం సూచించారు. అలాగే పంచాయతీ ఆధ్వర్యంలో చెత్తాచెదారం సేకరణకు వస్తున్న వాహన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

చీనీతోటలో పేకాట

యల్లనూరు: మండలంలోని గొడ్డుమర్రి సమీపంలోని చీనీ తోటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు మంగళవారం పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రూ.40,850 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

యాడికి: మద్యం మత్తులో క్రిమి సంహారక మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కోనుప్పలపాడు గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు. కోనా సోమశేఖర్‌రెడ్డికి ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు రామచంద్రారెడ్డి(32) ఏడేళ్ల క్రితం కాకినాడకు చెందిన కుమారిని వివాహం చేసుకుని అక్కడే లారీ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. వీరికి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. అప్పుడప్పుడు కోనుప్పలపాడుకు వచ్చి వ్యవసాయ పనులు చేసి మరలా కాకినాడకు పోయేవాడు. పది రోజుల క్రితం ఆయన కోనుప్పలపాడుకు వచ్చాడు. మంగళవారం సాయంత్రం తోటలో మద్యం మత్తులో క్రిమి సంహారక మందును తాగిన రామచంద్రా రెడ్డి అపస్మారక స్థితిలో ఇంటికి చేరుకున్నాడు. గమనించిన తల్లిదండ్రులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు మెరుగైన వైద్యం కోసం తాడిపత్రికి రెఫర్ చేశారు. బంధువులు యాడికిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రామచంద్రా రెడ్డి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ హెచ్చరించారు. మంగళవారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అక్రమంగా బెల్టు షాపులు, కర్ణాటక మందు, నాటు సారా విక్రయించకూడదన్నారు. అలాగే గ్రామాల్లో మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంత జీవనం సాగించాలన్నారు.

నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలి

గుంతకల్లు: నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వినోద్, వెంకట్‌నాయక్ డిమాండ్ చేశారు. రిజెక్ట్ ఎన్‌ఈసీ..సేవ్ ఎడ్యుకేషన్, రిజెక్ట్ బీజేపీ..సేవ్ ఇండియా అనే నినాదంతో మంగళవారం స్థానిక శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన విద్యావిధానంపై విద్యార్థులకు కలిగే నష్టాలపై తెలియజేసి సంతాకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివమణి, అఖిల్, శ్యామ్‌సుందర్, మధు తదితరులు పాల్గొన్నారు.